అప్పుడప్పుడు అక్కడక్కడ సన్నని మూలుగులు.

మందు వాసనల్ని మోసుకువస్తున్న గాలి తెరలు. అస్పష్టంగా కొట్టుకునే రోగినాడిలా దూరంగా నర్సులవి కాబోలు బూట్లచప్పుడులు. చావుబ్రతుకుల యుద్ధరంగంలా పేషెంట్లు నిండిన వార్డులు.

కన్నులు మూత పడటంలేదు. మంచమొక అంగార తల్పమైంది. ఔట్‌పేషెంట్‌డిస్పెన్సరీ ముందు బారుతీరిన రోగులా ఎడతెగని ఆలోచనలు. ఇదే తుదిరాత్రి నాకు. పన్నెండు రాత్రులు గడిచాయి. ఇది సరిగ్గా పదమూడోరాత్రి. తెల్లారితే డిశ్చార్జి ఔతాను. గడిచిన పన్నెండు రాత్రులూ ఏకమై ఈ సుదీర్ఘనిశిగా మారినవేమో!. . . ఎంతకీ తెల్లవారటం లేదు.

ఉద్యోగరీత్యా విజయవాడకి వెళ్ళి వస్తూంటే తిరుగుప్రయాణంలో సంభవించిన బస్‌ప్రమాదం నాకీ హాస్పిటల్ అనుభవాల ప్రాప్తిని కలిగించింది. గుంటూరుకి దగ్గర్లో ప్రమాదం జరగటం, ఈ గుంటూరు జనరల్‌హాస్పిటల్ ప్రాప్తి. ఈ ఘటన చాలా చిత్రమనిపిస్తూంది ఇప్పుడాలోచిస్తే. ఆశించని మజిలీ, అనుకోని అనుభవాలు నాతోపాటు ప్రమాదానికి గురైనవారు పలుగురు ఈ హాస్పిటల్‌లోనే ప్రాణం పోసుకుని బైటపడ్డారు. అందరికన్నా ఆఖరువాణ్ణి నేను.

నా కాలికి తగిలిన బలమైన గాయం మానింది. మెల్లిమెల్లిగా నడవగలుగుతున్నాను. రేపు డిశ్చార్జి చేస్తున్నారు.

హాస్పిటల్‌నించి వెళ్ళిపోవాలంటే ఏదో అర్థంకాని బాధ. . . . తలుచుకుంటే ఆశ్చర్యంకూడా వేస్తూంది. దానికి కారణం ఈ పదమూడు రోజులు నాకు కలిగిన అనుభవాలే అనుకుంటాను.

బ్రతుకుపైన పెనవేసుకున్న మమతలూ, అనుబంధాలూ, ఆవేదనలూ ఈ పదమూడు దినాలలో నేను చూచిన జీవితచిత్రాలు. వాటి రంగులూ, రేఖలూ చెరిగిపోనివి.

అడుగుల చప్పుడు! ఎవరో నర్సు. . . మళ్ళీ ఆ నర్సు వస్తే బావుణ్ను. ఆఖరుసారి సెలవు తీసుకోవాలనుంది.

"ఆమే!. . . ఆమే. . ." వరండాలోంచి పోతూంది. ఆమెను చూడగానే ఆనందంతో ఆలోచనలు తెగిపోయాయి.

"టైమెంతయింది సిస్టర్?" అనాలోచితంగా ప్రశ్నించాను.

"రెండు కావస్తూంది. మీ రింకా నిద్ర పోలేదేం?"

"రావటం లేదు. ." వినిపించుకున్నదో లేదో వెళ్ళిపోయింది. రేపు డిశ్చార్జి ఔతున్నానని చెప్పాలనుకున్నది మరిచేపోయాను. ఏమిటో! మనం ఏది చెయ్యాలనుకుంటామో అదే 'ఆ' సమయానికి తట్టదొక్కోసారి!

అయినా నేను చెప్పడమేమిటి? ఈ హాస్పిటల్‌లోని వందలాది రోగుల్లో నే నొకణ్ణి. నేను ప్రత్యేకించి చెప్పటమేమిటి? ఆయువును వెతుక్కుంటూ ఆశల్ని మోసుకుని రోజూ ఎందరు వస్తున్నారో! ఎందరు పోతున్నారో! ఎంత సరిపుచ్చుకోవాలన్నా ఏదో మూల తొలిచే వెలితి. ఈ పదమూడు రోజుల్లో ఆమె ఈ వార్డుకి వచ్చింది ఒకేసారి. ఆమె ఎవరో. పేరూ తెలీదు.

> చీకటిలో ప్రయాణించే బాటసారికి తటిత్కాంతి క్షణికమే అయినా, ఆ వెలుగు ఒక నిండుజీవితానికి చాలినంతటిది. అలాగే ఒక్కొక్కరి పరిచయం, లిప్తకాలమే అయినా, అనంతమైన ఆనందాన్నిస్తుంది.

అయినా ఎంతో తెలిసినట్టు, ఎన్నాళ్ళో పరిచయమున్నట్టూ అర్థంకాని అనుబంధం. భాషకందని భావాల్లాగా మనసుకే తెలీని మమకారాలు. . .

ఆ రోజు నా కాలికి కట్టుకట్టిన మూడో రోజు. మెల్లిగా లేచి లెట్రిన్‌కి వెళ్ళి తిరిగి వస్తున్నాను. పొరబాటున మంచం తగిలి కాలు విపరీతంగా బాధ పెట్టడంతో కూలబడి పోయాను.

అప్పుడే గదిలోకి వస్తున్న ఆమె నా పరిస్థితి గ్రహించింది.

"మిస్టర్, మీరు ఆ కాలు అప్పే నడవకూడదు. కనీసం నాలుగైదు రోజులకిగాని మీరు నడవలేరు" అంటూ నన్ను పట్టుకుని మంచం వద్దకి నడిపించింది. ఆమె పట్టుకుని నడిపిస్తూంటే నా కెలాగోఅనిపించింది. కానీ ఏం చేయను? తప్పలేదు. నడిపించి తీసుకు వెళుతున్నప్పుడు భయంగా ఆమె కళ్ళల్లోకి చూచాను. అవి నిర్మలంగా, అతి ప్రశాంతంగా ఉన్నాయి. ఆ చూపుల్లో ఏలాటి సంకోచసంచలనాలు లేవు. చల్లని వెన్నెల వానలాటి ఆ చూపులలో అమృతమయమైన ఆప్యాయతని చూచి నా ఊహకి నేనే సిగ్గుపడ్డాను. లోకానికి ఉద్యోగధర్మంగా కనిపించే ఆ సేవలో విధినిర్వహణకి అతీతమైన మార్దవాన్ని, మానవత్వాన్ని అనుభవించాను. ఈ జన్మకా ఒక్క అమృత లిప్త చాలు, అనంతమైన ఆనందాన్నిచ్చేందుకు.

పక్కమంచంలో సీతారామయ్య మెల్లిగా మూలిగి కొంత కదిలి పడుకున్నాడు నిద్దర్లో. ఆయన వచ్చి రెండు రోజులయింది. నిన్న ఎక్స్‌రే తీసి ఆపరేషన్ చెయ్యాలని నిర్ణయించారు. ప్రేవుల్లో ఏదో వ్రణముందట. రోజంతా బాగానే ఉంటాడు. ఉన్నట్టుండి కడుపులో నొప్పి వస్తుంది. బాధతో మనిషి చుట్టుకు పోతాడు. పది నిమిషాలు నరకయాతన అనుభవించి బాధనుండి బైట పడతాడు.

"ఇలా రోజూ చచ్చేకన్నా ఒక్కసారేపోతే బావుణ్ను. ఈ పసిదాన్ని నా కాళ్ళకి చుట్టాడు భగవంతుడు. లేకుంటే ఈపాటికి బాధే లేకుండా ప్రాణాలు తీసుకుని ఉందును" అంటాడు సీతారామయ్య. ఆయనలా అంటూంటే తెలిసీతెలీని ఏడేళ్ల శకుంతల ఏడుపుముఖం పెట్టేది. ప్రపంచంలోని దైన్యమంతా ఆ పసిదాని కనుపాపల్లో కనిపించినట్టై నా గుండె బరువెక్కేది. రెండు రోజుల సహజీవనంలో రెండు జన్మల బాంధవ్యం. . .

ఏరి కోరి అందర్ని ఎదిరించి శకుంతల వాళ్లమ్మని పెళ్ళాడాడట సీతారామయ్య. ప్రాణంగా ప్రేమించిన ఆ భార్య సీతారామయ్యని ఏకాకిని చేసి వెళ్ళిపోయింది, తాను విడిచిన ప్రాణంతో మరో ప్రాణికి జన్మనిచ్చి. శకుంతలకోసమే బ్రతుకుతున్నాడు సీతారామయ్య.

ఆపరేషన్ అనగానే దిగులుపడిపోయాడు సీతారామయ్య. 'ఒకవేళ నేను పోతే దీని గతేమిటి?' అని ఒకటే ఇది. ఒకరి కోసం బ్రతకటంలో ఎంత తృప్తి! ఆ మమకారంలో ఎందుకో అంత మాధుర్యం? ఇంత ప్రాణప్రదంగా భావించిన ఆ చిన్నారి శకుంతలే రేపు ఈడేరి ఆ తండ్రిని నిరాదరించవచ్చు. నిర్లక్ష్యం చేయచ్చు. తన ఆశలూ, ఆశయాలూ ఆ కన్నతండ్రి కన్నా మిన్నకావచ్చు. కన్నకడుపుని కాదని తన సుఖాన్నే ఎన్నుకోవచ్చు. లేకుంటే మురళి మాటేమిటి?

సీతారామయ్య వచ్చిన ముందుటి రోజే మురళి చనిపోయాడు. నాకన్నా ముందు చాలా రోజులనించి హాస్పిటల్‌లో ఉన్నాడు. నేను చేరిన నాలుగో రోజు ఒక సంఘటన జరిగింది. అంతవరకు ఏదో పలకరింపులు తప్పితే నాకు మురళితో పెద్ద పరిచయం లేదు. ఆ రోజు మురళిని చూచేందుకు అతని తలిదండ్రులు వచ్చారు. ఎంతో ప్రయాసపడి ఒక్కగానొక్క కొడుకు అచూకీ తెలుసుకుని ఆదుర్దాగా వచ్చారు. కానీ మురళి వారిని దరిజేరనివ్వలేదు. ఇక లాభంలేక డాక్టర్లు నచ్చచెప్పి వాళ్లను పంపేశారు. నాకు మురళిపై కోపం, అసహ్యం కలిగాయి.

వాళ్ళు వెళ్ళిన కాస్సేపటికి "పాపం ఎంత ఆశతో వచ్చారో ఏమో! ఎంతైనా కన్నప్రేవులు. కనీసం కాస్సేపు ఉండనిస్తే ఏం పోయింది మురళీ!" అన్నాను. మురళిముఖం జేవురించింది. అసలే రక్తపుపోటు. మనిషి ఆవేశంతో ఊగిపోతూ "రాజా! నీకు తెలీదు. . వాళ్ళు. . . వాళ్ళు. . . కన్నవారు కారు. కసాయివాళ్ళు. కిరాతకులు!. ." కోపంతో మాట్లాడలేక ఆయాసం రావటంతో ఆపేసి పడుకున్నాడు. ఆ సాయంత్రం నీరెండలో కూర్చుని అస్తమించే సూర్యుణ్ణి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాను. ప్రతి చీకటిరాత్రీ ఒక ఉషోదయాన్ని ప్రసవిస్తుంది. అలాగే ప్రతిజీవి వెళ్లిపోయాక ఏమిస్తాడు? . . .

"రాజా!"

వెనక్కి తిరిగి చూస్తే మురళి. ఆవేదనకి మారురూపంలా ఉన్నాడు.

"నామీద అసహ్యం వేసింది కదూ!. . ఔను రాజా! నేను మనిషిని కాదు. మృగాన్ని. నాది గుండె కాదు. . రాతిబండ. . . కానీ. . కానీ. . రాజా, ఈ బండే ఒకనాడు పువ్వులచెండుకన్నా మెత్తగా ఉండేది. నాకు నేను చెప్పుకోటం. . . రాజా! ప్రతివ్యక్తీ ఎదటివారి సానుభూతి నాశిస్తాడు. అందులోనూ ఆఖరిమెట్టుపై నిలబడి అవతలి గట్టును చూసే అభాగ్యుడికి ఒక్క చిరునవ్వు, అభిమాన పూర్వకమైన ఒక్క మాట చాలేమో! నా కథ తెలిస్తే నన్ను క్షమిస్తావు. . తప్పక క్షమిస్తావు. . ." అన్నాడు. ఆ కంఠంలో దిగంతాలను స్పృశించే ఆర్తనాదం వినిపించింది. డాక్టర్ అటుకేసి రావడంతో లోపలికి వెళ్ళిపోయాం.

ఆ కథ నాకు చెప్పకుండానే మరునటి రోజు మరణించాడు మురళి. శవాన్ని తొలగించే సమయంలో తలగడ

సత్యవేటి శ్రీకాంత్

# వెళ్లిపోయే ముందు



కింద ఒక ఉత్తరం ఉంది. ఎప్పుడు రాశాడో ఏమో పేర ఉంది!

సును కదిలించి, కరిగించిన ఆ ఉత్తరంలోని ఇది:

ళితండ్రి ఓ పెద్ద భూస్వామి. వాళ్లింట్లో నాగులు. నాగులు కూతురు సుబ్బలక్ష్మి. ప్రేమించాడు మురళి. ఇది తెలిసిన మురళితండ్రి ఆపిల్లకినిమిషాలమీద పెళ్ళి జరిపించేశాడు. మద్రాసులో లా చదువుతూన్న మురళికిది తెలిసేప్పటికి మూడు రోజులు పట్టింది. అప్పటికే సుబ్బలక్ష్మిశవం బావిలో తేలింది.

మురళి తల్లిదండ్రుల్నేకాక తన సుఖశాంతుల్ని దూరం చేసుకుని భగ్నజీవి అయ్యాడు. బ్లడ్‌ప్రెషర్ వచ్చింది. కనిపించని కన్నీళ్లు గుండెల్లో దాచుకుని కుమిలి కమిలి వెళ్లిపోయాడు. కన్న తల్లిదండ్రుల్ని కసిరికొట్టినవాడు ఎవరో తెలీని నా సానుభూతి కోసం తపించాడు. మృత్యువు క్రీనీడలో శయనించే మురళిలో చావని ఆత్మాభిమానం తలపుకి వస్తే మనిషి కొన్ని ఆశయాలకేగాక ఆవేశాలకికూడా అంకితమై పోతాడేమో అనిపించింది.

సీతారామయ్య ఉలిక్కిపడి లేచాడు.

"ఏమిటండీ" అన్నాను. ఆయన ముఖంలో విషాదం గూడుకట్టుకుని ఉంది.

"ఇది చాలా చిన్న ఆపరేషన్ మీరేం భయపడద్దు" అని ఎందరెన్నిమార్లు చెప్పినా అధైర్యం ఆయన్ని విడిచిపెట్టలేదు.

"ఏం లేదు రాజా! ఏదో పిడకల." ఆ గొంతులో ఏదో తెలియని భీతి.

"మీరనవసరంగా కంగారు పడుతున్నారు" అన్నాను.

"చావంటే భయం కాదు రాజా! ఇది బ్రతుకుకోసం భీతి. రెక్కలుదాని ఈ కూనకోసం పడే ఆరాటం" అంటూ క్రింద చాపమీద అన్ని బాధలకీ అతీతంగా నిద్రపోతున్న కుంతల కేసి చూశాడు.

నిజమే! ప్రపంచంలో ప్రతి ఒక్కరు తమకోసమే బ్రతకటం సాగిస్తే ఈపాటికి ఈ లోకం మరోలా ఉండేదే! మమత అనేది లేకుంటే జీవితంలోని మాధుర్య మేదీ? "ఏకోసం బ్రతుకుటయే నిజమైన హాయి!" ఎవరో ఎక్కడో రాశారు. . .

ఎవరూలేని అనాథజీవితం నాది. ఎక్కడ పుట్టానో, ఎవరికి పుట్టానో? నాకు తెలిసేప్పటికి నెల్లూరులో పట్టాభిరామిరెడ్డి హాస్టల్‌గా పేరుబడ్డ ఒక హాస్టల్‌లో ఉన్నాను. జీవితంలో అభిమానం, అనురాగం నోచుకోని నాకు ఈ హాస్పిటల్ ఒక దివ్యలోకంలా ఉంది. కానీ తెల్లారితే ఆ బంధంకూడా తీరిపోతుంది. . . ఆ నర్సుకి చెప్పకుండా వెళ్ళిపోతున్నాను. . చివర తెలియని చీకటివంతెనలో అడుగుకొక్క జన్మగా పయనించే బాటసారికి ఒక్క క్షణం వెలుగుచూపిన తటిల్కాంతి. ఆ మెరుపు మెరిసింది క్షణకాలమే అయినా ఆ మిణుగు ఒక నిండు జీవితానికి చాలినంతటిది. ఆ అనుభవం ఆ పాంథునికి సుదీర్ఘమైన తమఃపథంలో ఆరిపోని కరదీపిక. ఆమెతో "వెళ్ళివస్తానండీ" అనే అవకాశం ఉందోలేదో! ఉదయాన్నే కనిపిస్తే బావున్ను. కనీసం ఆమె పేరైనా తెలీదు. ఆలోచనలనుంచి బైటపడి చూస్తే సీతారామయ్య నిద్రపోతున్నాడు.

బయట ఏదో చప్పుడైంది. వరండాలోంచి ఎవరో పేషెంటుని స్ట్రెచర్‌మీద తీసుకువెడుతున్నారు. దేహమంతా బాండేజీగుడ్డలతో నిండిపోయి ఉంది. స్ట్రెచర్‌చుట్టూ అయిదారు మంది ఉన్నారు. ఆ ంపు లేడీస్ వార్డ్‌కేసి వెళ్ళింది. ఆ వైపునుంచి న్నున్న వార్డ్‌బాయ్‌ని "ఏమిటి విశేషం" అని అడిగాను.

పేషెంటు భర్తకి మరో స్త్రీతో సంబంధముందట. ంత చెప్పినా అతడు ఆ సంబంధం విడిచిపెట్టకపోయే ికి తాను కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుందిట.

జీవితంలో ఏ అనుబంధాన్ని, ఏ అనుభవాన్ని ివితంకన్నా ఎక్కువగా భావించకూడదు. దానివల్లే ంలాటి దుర్ఘటనలన్నీ సంభవిస్తాయనిపించింది నాకు. ుయినా అనుబంధం మనిషి అంతర్యానికి ప్రాణం.

చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పిన కథ జ్ఞాపకం చ్చింది. ఓ పక్షి భూదేవతకి అప్పుపడి ఆ ఋణబాధ ప్పించుకోడానికి ఎంతో దూరం పరిగెత్తి ఓ పొదలో క్కుందిట. . . పాపం తెలివితక్కువ పక్షి. ఏ అక్కడా "అప్పు ఎప్పుడు తీరుస్తావ్?" అని పించిందట! మనిషికూడా ఈ బంధాలు తెంచుకోవా లనుకుని ఏదో చేస్తాడు. కానీ ఏం లాభం? బంధమే బ్రతుకాయె!

ఎదటిమంచంలో కన్నస్వామి ఏదో కలవరిస్తున్నాడు. కన్నస్వామి అరవయ్యో పడిలో పడినమనిషి. కండబలం తగ్గినా గుండెబలం తగ్గని వ్యక్తి. నిన్న సాయంత్రం డాక్టర్ "మీవాళ్ళెవరైనా ఉన్నారా?" అన్నప్పుడు "నా కెవరూ లేరు. . ఎవరూ లేరు" అంటూ తనలో తాను గొణుక్కున్నట్టు సమాధానం చెప్పాడు. డాక్టర్ వెళ్ళిన కాస్సేపటికి కన్నీళ్ళు తుడుచుకోడం చూచాను. పాపం! ఎవరూలేని ఏకాకి జీవితం! వెళ్ళిపోయేముందు ఎవరూ లేకపోవటం!. . . ఎంత దుర్భరం! కన్నస్వామిని చూస్తే జాలేసింది.

మెల్లిగా మంచం దిగి వెళ్ళి ఓదార్చాను. ఎందుకో ఈ కొద్ది రోజుల్లోనే ఎంతో దగ్గిరయినాడు కన్నస్వామి.

"రాజా! నీ మాటలు వింటూంటే ఏదో తృప్తి. ఏనాటి బంధమో ఈ కొద్ది రోజుల్లో నా కన్నకొడుకు కన్నా దగ్గిరయ్యావు."

"నిజంగా కొడుకు ఉన్నట్టే పొల్చేశావే" అన్నాను నవ్వుతూ!

> * సత్యాన్వేషి
> సత్యాన్ని అన్వేషించే వ్యక్తి ఏదేశానికీ చెందనివాడై ఉండాలి.
> —వోల్టేర్

"కొంపలిపే ఉన్నాడు. కొడుకేగాదు, కూతురూ ఉంది. కానీ. . నాకు వాళ్ళిద్దరూ లేనట్టే. . ."

ఎన్నాళ్ళో దాగిన కన్నీళ్ళు పొంగివచ్చాయి. బాధను అణుచుకుని కన్నస్వామి వినిపించిన కథ యిది:

చాలా పేదరికంలోంచి స్వశక్తితో పైకివచ్చాడు కన్నస్వామి. తనకు చదువు లేకున్నా కొడుకుని ఇంజనీరుని చేశాడు. కూతుర్ని కలెక్టర్‌కిచ్చి పెళ్లి చేశాడు. జీవితం కాలసర్పమై కాటేసింది. తన సంపాదనంతా పిల్లలకే ఖర్చు పెట్టేశాడు, తనకని కానీ మిగుల్చుకోకుండా. కొండంత కొడుకున్నాడనుకున్న కన్నస్వామికి కోడలి మంచితనం, అల్లుడి ఔదార్యం రెండూ కరవైనాయి. అనాదరణకన్నా అనాథ జీవితాన్నే ఎన్నుకుని అజ్ఞాతంగా జీవించాడు.

"పుత్రుడు పున్నామనరకం తప్పిస్తాడంటారు. ఎవరి కెవరు? కడుపటిదలో కనికరంతో కన్నీళ్ళ పెట్టేందుకు నీవే మిగిలావు" అంటూ తన కథ ముగించాడు కన్నస్వామి. నిట్టూర్పు విడిచాను. అంతకన్నా ఏం చేయగలను?

ఎదురుగా ఉన్న లేడీస్ వార్డులో ఏడుపులు. . . ఇంతకుముందు తీసుకువెళ్లినామె పోయిందేమో! ఎందరు వస్తున్నారో, ఎందరు తిరిగి పోతున్నారో, ఎందరు మరోలోకానికి తరలిపోతున్నారో!

వరండాలో డాక్టరుగారి స్వరంలాగుంది.

"ఈ గదిలో ఒక మంచం ఖాళీ అవుతుంది. కాగానే మీవాడికా మంచం ఇస్తాను."

ఇంతలో డాక్టర్‌గారు వచ్చారు. "మంచం ఖాళీ కొతుందంటున్నారు వాడేవా సార్?" అన్నాను.

"నిదికాదు" అనేసి తీవ్రంగా వెళ్లిపోయారు.

నాకు విచారం ముంచుకు వచ్చింది. ఆ మంచం బహుశా కన్నస్వామిదేమో! కన్నస్వామిని చూచాను. ఏదో కలవరిస్తున్నాడు. ఆ నిద్ర మేల్కొంటాడో లేదో! ఉన్నట్టుండి ఒక ఆలోచన వచ్చింది. ఎదురు మంచంలో రంగనాథం రేపు స్పెషల్‌వార్డ్‌కి వెళతాడట. అతనిది కావచ్చు. అతగా వెళ్లి అతన్ని లేపాను. అతని మంచం అప్పుడే ఇంకొకరికి రిజర్వ్ అయిపోయిందిట! . . .

ఆ నర్సు వస్తే ఈ విషయమైనా అడగవచ్చు. లేచి వరండాలోకి వెళ్లాను . . . తెల్లవారబోతూంది. ఇక మూడు నాలుగు గంటల్లో డిశ్చార్జి కొతాను.

వెళ్లిపోయేముందు కాసేపు మాట్లాడిపోదామని కన్నస్వామి దగ్గిరికి వెళ్లి కదిల్చాను.

కదలిక లేదు. సందేహంగా ముసుగు తీశాను.

కన్నస్వామికీ రాత్రి తెల్లవారని రాత్రి అయింది. ఎన్నటికీ తెరవబడని ఆ కన్నుల్లో ఎన్ని ఆశలు, ఎంత ఆవేదన దాగి ఉన్నాయో! ఆ కనురెప్పలకింద చెప్పలేని బాధలు, చెప్పుకోలేని గాథలు ఇంకా ఎన్ని ఉన్నాయో?

శాశ్వతంగా మూసుకున్న ఆ రెండు కళ్లల్లోను ఒలికేందుకు చాలీచాలని కన్నీళ్లు నిలిచి ఉన్నాయి. అనంతశాంతి స్థావరానికి వెళ్లే సంతోషంలో తిరిగిన ఆనందాశ్రువులో, ఆరని అశాంతిలో కరిగిన దుఃఖాశ్రువులో! ఎవరి కెరుక! నిశ్శబ్దంగా నా కన్నీరు కురుస్తున్నది.

కాసేపటికి కన్నస్వామిని తీసుకువెళ్లిపోయారు. నేను వెళ్లి డిశ్చార్జ్‌సర్టిఫికెట్ తీసుకుని సీతారామయ్యతో చెప్పిపోదామని వచ్చేప్పటికి ఉదయం తొమ్మిది గంటలైంది. అప్పటికే ఆయన్ని ఆపరేషన్‌థియేటర్‌కి తీసుకువెళ్లిపోయారట.

కన్నస్వామి మంచంపై కొత్త పేషెంటు పడుకుని ఉన్నాడు. మృత్యుతీరంలో జీవనకలశాన్ని వెదికే మరో అన్వేషి, మరో ఆశాజీవి. . . మానవుడు!

చావుబ్రతుకుల సంధ్యారాగంలో మరో ప్రస్థానం, మజిలీ ఏదో! బరువెక్కిన హృదయంతో మెట్లు దిగుతూంటే అప్పుడే గేటు వద్ద రిక్షా ఎక్కుతూన్న ఆ నర్సు. కనిపించింది

పిలుద్దామని గొంతెత్తాను కానీ పేరేమిటి? గొంతు లోని పిలుపు వెలికి రాలేదు.

రిక్షా కదిలింది. ఆ ఆవేగంలో అడుగు వేగంగా వేశానేమో! జివ్వు మంది కాలు, కూలబడిపోయాను.

వినిపించని పిలుపు. కనిపించని మలుపు. ఇదే జీవితం. మెల్లిగా లేచి గేటు చేరాను. రిక్షా కనుచూపు మేర దాటిపోయింది.

కన్నస్వామీ, మురళీ కన్నుల్లో మెదిలారు.

జీవితంలో తమితీరకనే మిగిలిపోవచ్చు, అది దరిజేరకనే ముగిసిపోవచ్చు. కాని తిరిగి రానిచోటికి తరలిపోయే ముందు ప్రతిజీవీ తనవారికి ఏవో చెప్పుకోవాలని తపిస్తాడు. వెళ్ళిపోయేముందు వెచ్చటి కన్నీటిబొట్టు,తనకోసం రాలటం చూడాలనుకుంటాడు. "వెళ్లిరా" అనే వీడ్కోలు బయలుదేరే ప్రయాణికుడికి ఎంత సంతోషమో వెళ్లిపోయేముందు ప్రతిజీవికీ ఆర్ద్రమైన పలుకు అంతే అవసరం!

కానీ ఏ కొందరికోతప్ప అందరికీ రాదేమో ఆ భాగ్యం! ★